www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 18 | జూలై | 2025
పేజీలు : 8

## పాలకుల వైఖరిని యువత ఎండగట్టాలి




- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపు
- ముత్తగూడెంలో అట్టహాసంగా 13వ మండల మహాసభ
- ఏకగ్రీవంగా 14వ నూతన కమిటీ ఎన్నిక

2లో..

# అటు కలుపుకుంటున్నారు.. మరి ఇటు సంగతేంటో..!



- తెలంగాణ గ్రామాలను మహారాష్ట్రలో విలీనానికి రంగం సిద్ధం
- భద్రాద్రి ఐదు పంచాయతీలకు మోక్షం కలిగేనా

**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణలో ఉన్న కొన్ని గ్రామాలు మహారాష్ట్రలో విలీనం కాబోతున్నాయి. మరి ఆంధ్రాలో ఉన్న ఐదు పంచాయితీలు తెలంగాణలో విలీనం అయ్యేది ఎప్పుడో అనే ప్రశ్న తలెత్తుతోంది. రాష్ట్ర విభజనలో చోటు చేసుకున్న అనేక చిక్కుముళ్లు భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర తలనొప్పిగా మారింది.

**అటు కలుపుకుంటున్నారు...**

తెలంగాణకు చెందిన 14 గ్రామాలను మహారాష్ట్రలో కలుపుకునేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రంగంసిద్ధం చేస్తున్నట్లు ఆ రాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ బవాంకులే అధికారిక ప్రకటన చేశారు. ఈ మేరకు తమ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మిగతా 2లో..

## ఖమ్మంను సుందరంగా తీర్చిదిద్దాలి

-పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాలి
-అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి
-షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో 37వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 1.75 కోట్లతో రైల్వే స్టేషన్ దగ్గరలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మిగతా 2లో..

## మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం




-కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పం
-అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
-ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ కూసుమంచి :** మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ధృడ సంకల్పంతో పని చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ఆవరణలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి పాలేరు నియోజక వర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్నారు. 4585 సంఘాలకు రూ. 5.62 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా క్రింద 56 మందికి రూ. 44.90 లక్షల చెక్కులను, ప్రమాద బీమా క్రింద ఐదుగురు సభ్యుల నామిని ఖాతాల్లో రూ. 10 లక్షల చొప్పున రూ. 50 లక్షలు చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ మిగతా 2లో..

## ఇబ్బందులు తప్పని ఇందిరమ్మ ఇళ్లు



-ఊపందుకోని ఇందిరమ్మ ఇంటి పనులు
-రోజురోజుకు పెరుగుతున్న నిర్మాణ వ్యయం
-వ్యయభారంతో లబ్ధిదారులు వెనుకడుగు

**ప్రజాపక్షం/మణుగూరుః** మండలంలో ఇందిర మ్మ ఇళ్ల మంజూరులో ఉన్న వేగం, నిర్మాణంలో కరువైంది. పలు పంచాయితీలలో ఇందిరమ్మ ఇంటి పనులు ఊపందుకోవడం లేదు. చేతిలో చిల్లి గవ్వలేని నిరుపేదలబ్ధిదారులు ముగ్గు పోసు కునేందుకు ముందుకు రావడం లేదు. గృహ విస్తీర్ణాన్ని 600 చదరపు అడుగు లకు పరిమితం చేయడం కూడా ఈ పథకం ప్రగతికి ప్రతిబంధకమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటికి తోడు సిమెంట్, ఇటుక, స్టీలు వంటి వాటి ధరలు భారీగా పెరగడంతో లబ్ధిదారులు పనులు ప్రారంభిం చేందుకు వెనకాడుతున్నారు. ధరలు ఆకాశాన్నంటడంతో ప్రభుత్వ నిర్దేశిత వ్యయం లో ఇంటి నిర్మాణం పూర్తి కావడం కష్టమేన న్న అనుమానాలున్నాయి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు చెల్లిస్తున్నప్పటికీ లబ్ధిదారులకు ఇంతకు రెట్టింపు స్థాయిలో ఖర్చుపెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు.

**భారీగా పెరిగిన ఇంటి నిర్మాణ వ్యయం...**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంది రమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ప్రస్తుత రోజుల్లో ఇంటి నిర్మాణ వ్యయం భారీగా మిగతా 2లో..

# అటు కలుపుకుంటున్నారు..
# మరి ఇటు సంగతేంటో..!

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రాజూరా, జీవతి తాలూకాలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 14 గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేస్తామని చెప్పారు. ఆ గ్రామ ప్రజల, అధికారులు, అన్ని పార్టీల నేతల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. ఆ 14 గ్రామాలకు చెందిన రికార్డులు, జమబందీ అన్నీ మహారాష్ట్రలోనే ఉన్నాయని, వీటిని చంద్రపూర్ జిల్లాలో కలపనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి ఎక్స్ వేదికగా కూడా ప్రకటించారు. కాగా మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం ఉండటం కేంద్రంలో కూడా బిజేపి పాలన సాగుతుండటంతో వారు తమను అనుకూలంగా ఆర్డినెన్స్ తెచ్చుకుని ఆ గ్రామాలను కలుపుకుంటున్నట్లు తెలుస్తోంది.

**మరి ఇక్కడి సంగతేంటి....**

ఏపిలో విలీనమైన ఐదు పంచాయితీల సంగతేంటి అంటు ఆయా పంచాయితీల ప్రజలు గోడు వెల్లబోసుకుంటున్నారు. ఏ చిన్న విషయానికైనా భద్రాచలం రావటమే సరైందని, లేదంటే వందలమైళ్లు పోయి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, ఎన్నికల సమయంలో ఐదు పంచాయితీలపై తెలంగాణలోని ముఖ్యనాయకులు, బిజేపి నేతలు సైతం మాట్లాడారని, దానిపై కనీసం చర్యలు తీసుకున్న దాఖలాలే లేవంటున్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలుగా పరిగణిస్తూ తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం రూరల్, కూనవరం, విఆర్ పురం, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గంపాడు మండలం (కొద్దిభాగం) ఏడు మండలాలను ఏపిలో విలీనం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా. భద్రాచలం మండలంలోని భద్రాచలం పట్టణ మినహా మిగతా ప్రాంతం మొత్తంలో ఏపిలో విలీనం కావడంతో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారు ఏపిలో ఉన్నా న్యాయపరమైన విషయాలు మినహా మిగతా పనులన్నీ ప్రక్కనే ఉన్న భద్రాచలం లోనే చేసుకోవాలి. ఇదిలా ఉండగా భద్రాచలం రాముల వారికి చెందిన భూములు మొత్తం ఏపిలోని పురుషోత్తపట్నంలో ఉండగా అక్కడ నిత్య రావణ కాష్ట సాగుతోంది. రామాలయం మాత్రం తెలంగాణలో ఉంది. దీంతో ఎప్పుడూ ఇక్క ఉద్రిక్త పరిస్థితే. ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయితీలు నిత్యం భద్రాచలానికి అనుసంధానంగా ఉంటాయి. ఆ పంచాయితీల ప్రజలు ఏపిలో న్యాయపమరైన సమస్యల కోసం, కార్యాలయాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మహారాష్ట్రాకు చెందిన ప్రభుత్వం తెలంగాణలోని 14 గ్రామాలను విలీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండగా, ఏపిలోని ఐదు పంచాయితీలను తెలంగాణాకు తెచ్చుకునేందుకు న్యాయపరమైన చిక్కు ముడులు తొలగిపోయేలా తెలంగాణ ప్రభుత్వం కూడా చర్యలకు ముందుకు వచ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం




(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంతో తల్లికి కొడుకుకి ఉన్న అవినాభవ సంబంధం నాకు ఉందన్నారు. ఇక్కడ ప్రజల దీవెనలతో 18 నెలల క్రితం కనివిని ఎరుగని మెజార్టీతో గెలిపించారన్నారు. పేదొడికి భరోసా ఇవ్వడంలో ఆ నాటి ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదవాడి పక్షపాతిగా 18 నెలల నుంచి ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆనాటి ప్రభుత్వం బెల్ట్‌షాపులు పెట్టి ప్రోత్సహిస్తే నేడు ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇచ్చిందన్నారు. కొత్తగా 5.65 లక్షల రేషన్ కార్డులను ప్రభుత్వం ఇస్తుందని 16 లక్షల మంది పేర్లు రేషన్ కార్డులలో మార్పులు చేర్పులు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మొదటి విడతలోనే ఒక్కో నియోజక వర్గానికి 3,500ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. రాబోయే మూడు విడతల్లోనూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇస్తామన్నారు. కుల, మతం పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలను అందించే బాధ్యత తనదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా అందించామన్నారు. రూ. 500 బోనస్ ఇచ్చి రైతును రాజును చేశామన్నారు. 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు. హాస్టల్‌లో మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి పిల్లలకు మంచి ఆహారం అందిస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలెండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పది లక్షలకు పెంచామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోలు, ఆర్టిసి అద్దె బస్సుల బాధ్యత నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలో 4,585 మహిళా సంఘాలకు రూ. 5.62 కోట్ల వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అంచలంచెలుగా ఎదిగి ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఆర్టిసి అద్దె బస్సులు, ఇసుక రీచ్‌ల నిర్వహణ, స్త్రీ టీ స్టాల్, షీ రాక్స్ ఎన్నో ఏర్పాటయ్యాయన్నారు. ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడి మహిళలు ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, సివిల్ సప్లయ్ డిస్ట్రిక్ మేనేజర్ శ్రీలత, పాలేరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, మండల సమాఖ్య సభ్యులు, ఎంపిడివోలు, ఏపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంను సుందరంగా తీర్చిదిద్దాలి

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించాలన్నారు. మన ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రోడ్డు వెడల్పుతో నగరం సుందరంగాను, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రహదారులు విస్తరించడం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఖమ్మం నగరానికి అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్లు, ఆర్డివో నర్సింహారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



# పాలకుల వైఖరిని యువత ఎండగట్టాలి





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ... పెత్తందారుల చేతిలో ప్రభుత్వాలను కీలుబొమ్మలుగా మార్చిన పాలకుల వైఖరిని ప్రజాక్షేత్రంలో యువత ఎండగట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర పిలుపునిచ్చారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెం డివిజన్‌లోని సావిటి సెంటర్‌లో అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 13వ మండల మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత అక్కడి పురవీధుల్లో డప్పు శబ్దాలతో ర్యాలీ ఘనంగా సాగింది. అలాగ అక్కడ ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, యువజన సంఘం జెండాని ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధినేని కర్ణకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘనపారపు ఉపేందర్, దేవరపల్లి వెంకటకృష్ణ, కళ్లెం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు...18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు, పలు హక్కులు ఏఐవైఎఫ్ చేసిన పోరాట ఫలితంగానే లభించాయన్నారు. కానీ ప్రభుత్వాలు యువత ఓట్లను అధికార పీఠాన్ని ఎక్కించే సాధకులుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. భారతదేశంలో 60శాతం ఉన్న యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. పల్లెల నుంచి పట్టణాల దాకా గంజాయి, డ్రగ్స్ వ్యాప్తి చెందడంతో పాటు సెల్‌ఫోన్ సైతం యువతను పెడదోవ పట్టిస్తుందన్నారు. కావున ఏఐవైఎఫ్ యువకులు, యువతను చైతన్య పరుస్తూ ఇటువంటి తప్పుడు పద్ధతులపై గలమెత్తాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఆపరేషన్ కగర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అడవుల్లోని 36రకాల ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకే నక్సలైట్లను హతమారుస్తున్నట్లు ఆరోపించారు. అంతేకాకుండా తమ అధికార వాంఛతో ప్రజల మధ్య వైశమ్యాలు రెచ్చగొడుతూ..మతోన్మాదం సృష్టిసుందని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా పరిగణించాడని, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మతత్వ రాజకీయాలపై ఏఐవైఎఫ్ యువకులు ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజాకోర్టులో శిక్షపడేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఖమ్మంరూరల్‌మండలం, ఏదులాపురంమున్సిపాలిటీలను కలిపి 63మందితో 14వ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ గౌస్‌పాషా, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ పాలేరునియోజకవర్గ అధ్యక్షుడు ఉసికల రవి, కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తినాయక్, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, యడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్బందులు తప్పని ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగింది. సిమెంట్ ధర ఇప్పుడు సంచి రూ. 340/ కి చేరింది. ఒక్కో ఇటుక రూ. 8 పలుకుతోంది. మేస్త్రీకి తక్కువలో తక్కువ రూ. లక్ష వరకు చెల్లించాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్ష లతో పోల్చుకుంటే నిర్మాణ వ్యయం భారీగా ఉంటోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇది కూడా ఈ గృహాల నిర్మాణం నత్తనడ కన సాగడానికి కారణమనే అభిప్రాయం ఉంది. మంజూరులో ఉన్న వేగం, నిర్మాణంలో కరువు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వనులు కొన్ని గ్రామాల్లో మాత్రమే చురుకుగా కొన సాగుతున్నాయి. మండలంలోని 14 పంచాయతీలకు మొదటి, రెండో విడతలో 407 ఇల్లులు మంజూరు చేయగా అందులో 332 లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ ఇల్లులు ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణ దశలో ఉన్నాయి. ఒకొక్క గ్రామానికి 20 నుంచి 30 ఇళ్ల మంజూరు కాగా, మేజర్ గ్రామ పంచాయతీ సింగారంలో 80 ఇల్లులు, మున్సిపాలిటీ పరిధిలో 389 ఇల్లులు మంజూరయ్యాయి.

**మంజూరులో వేగం... నిర్మాణంలో జాప్యం..**

పెరిగిన ధరలు మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అతలాకుతలం చే స్తున్నాయి. దీంతో ఇళ్ల మంజూరులో ఉన్న వేగం నిర్మాణంలో కనిపించడం లేదు. మరో వైపు ఆషాడం కూడా అడ్డంకిగా మారింది.

**అప్పో సొప్పో చేసి నిర్మాణం ప్రారంభిద్దామనుకున్నా...**

ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కొంత మొత్తంలో అయినా డబ్బు అవసరం. బేస్మెంట్ వరకు కట్టాలంటే కనీసం రూ. 1.50 లక్షలు ఖర్చవుతుంది. బేస్మెంట్ నిర్మా ణం పూర్తయ్యాకే రూ.1 లక్ష బిల్లు వస్తుంది. నిరు పేదలకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించడం కష్టమవుతోంది. అప్పో సొప్పో చేసి నిర్మాణం ప్రారంభిద్దామనుకున్నా.. బిల్లులు వస్తాయో, రావోననే ఆందోళన చాలామందిలో ఉంది. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన చాలా మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టే స్థోమత లేక పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు. మరికొంత మంది లబ్ధిదారులు తక్కువ విస్తీర్ణం నచ్చక ఇళ్లు కట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. పునాదుల దశలో ఇచ్చే రూ. లక్షకు అదనంగా ఖర్చు కావడంతో చాలా మంది లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో మండలం లోని ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన కొన సాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పెరిగిన ఇసుక, సిమెంట్, ఇటుక, ధరలను అదుపులోకి తీసుకురావాలని, లేదంటే నిర్మాణంలో జాప్యం.. పథకం అమలుకు భారంగా మారుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం : తెల్లూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారికి వారం రోజుల్లో బిల్లులు వస్తాయని, ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే పనులు మొదలు పెట్టాలి.

# అశ్వారావుపేటలో పర్యటించిన మంత్రి పొంగులేటి





ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట మున్సిపాల్టీలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటిడిఏ పిఓ బి.రాహుల్‌తో కలిసి మున్సిపాల్టీ పరిధిలో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల మున్సిపాల్టీగా ప్రకటించబడిన అశ్వారావుపేటలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, పట్టణ సుందరీకరణ పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా వంటి అంశాలపై స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, వారి అవసరాలను తెలుసుకున్నారు. అధికారులతో చర్చిస్తూ పనులు నాణ్యతపై ఖచ్చితమైన పర్యవేక్షణ ఉండాలని, ప్రజల అవసరాలకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచనలు చేశారు. అభివృద్ధి పనులు వేగం పెంచాలని, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపస్థులు తదితరులు పాల్గొన్నారు.

**రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన పొంగులేటి...**

అశ్వారావుపేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా పరిస్థితులు, హాస్టల్ వసతులు విద్యార్థులకు



అందుతున్న ఆహారం నీటి సరఫరా శుభ్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి సంతృప్తికరంగా ఉన్నారా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అన్ని ఉత్తమంగా పనిచేయాలన్నదే సిపిఎం రేవంత్‌రెడ్డి ఆశయమని, వారి శ్రేయస్సు కోసం వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ నూతన మెనూ సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏఅసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. హాస్టల్ యజమాన్యానికి ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ బి.రాహుల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్దిదారులకు మంజూరైన పత్రాలను పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో భాగంగా 13 మంది లబ్ది దారులకు మంజూరైన ఇండ్ల పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు యండపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా ఇండ్లు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్‌కు ఆర్థికసాయం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్స్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ సోదరునికి ఆర్థిక సాయం చేశారు. ఖమ్మం కార్పోరేషన్ నందు గత 30 ఏళ్లుగా టూ వీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్న బోజడ్ల నాగేశ్వర రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. యూనియన్ తరుపున గురువారం బోజడ్ల నాగేశ్వరరావుకు ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ చేతుల మీదుగా రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఖమ్మంలో మెయిన్ రోడ్డులో ఉన్న మెకానిక్ షాపుల వారు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. మెకానిక్‌లంతా కలిసి కట్టుగా ఉంటే ఏ ఆపద వచ్చినా ఆదుకోవచ్చన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ఇప్పటి వరకు యూనియన్ తరుపున మెకానిక్ కుటుంబాలకు రూ. 10.25 లక్షలు ఆర్థిక సాయం అందించామన్నారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్‌కు ఏ ఆపద వచ్చినా యూనియన్ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు షేక్ హమీద్, తట్టుకోనూరి బ్రహ్మాచారి, గద్దం లాలయ్య, తూము సత్యం, యర్రోజు నరేష్, షేక్ సోందు, ఉపేందర్, మహంకాళి చారి, సతీష్, నరేష్, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**-అంబేద్కర్ విగ్రహానికి వినతి**

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. గురువారం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం మయూరిసెంటర్ అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ప్లేకార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టియుజెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం తొలి దశ ఉద్యమంలో 369 మంది తుపాకీ తూటాలకు బలయ్యారని, మలి దశలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్నారన్నారు. ఉద్యమకారులు శారీరకంగా, వృత్తిరీత్యా ఆర్థికపరంగా అన్ని రకాలుగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తక్షణమే ఉద్యమకారులకు కార్పోరేషన్ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, 250 గజాల ఇంటి స్థలంతో పాటు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించాలన్నారు. ఉద్యమకారులకు ప్రతి నెల రూ. 30వేల పింఛన్, ఉచిత బస్‌పాసులు, హెల్త్‌కార్డులు, ప్రభుత్వ పథకాల్లో, ఉద్యోగాల్లో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పనిచేసిన కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రామారావు, జిల్లా అధ్యక్షులు పాలకుర్తి కృష్ణ, అంగిడి బిక్షం, ఎస్‌కె ఫక్రుద్దీన్, తునికి పాటి చారి, ఉల్లోజు వెంకన్న, వి. రాజేష్ నాయక్, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, రమ, అరుణ, పలువురు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఏర్పాటు చేయాలని మేనేజర్‌కు వినతి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా బస్‌డిపో మేనేజర్‌కు కార్యాలయంలో ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వెంకటగిరి డివిజన్‌కు చెందిన ప్రజలు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా పరిషత్ పెద్ద వెంకటగిరి, అప్పర్‌ప్రైమరీ పాఠశాలకు కోటా నారాయణపురం, ఇందిరమ్మ ఫేస్1, ఇందిరమ్మ ఫేస్2, కోదాడక్రాస్‌రోడ్, టౌన్‌షిప్‌ల నుంచి వెళ్లేందుకు ప్రయాణానికి ఇబ్బందులు అవుతున్నట్లు పేర్కొన్నారు. కావున బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సంఘం నాయకుడుకందుకూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

## అమరుల ఆశయసాధనకు కృషి చేయాలి



ప్రజాపక్షం/ మధిర : ప్రజా సేవకు అంకితమై వారి కష్టాలు ఇబ్బందులు తీర్చేందుకు ప్రజల పక్షాన భారతకమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నిర్వహించి అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి అమరజీవి సంగేపు నర్సింహారావు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు అన్నారు. ఇటీవల సంగేపు నర్సింహారావు మృతి చెందగా గురువారం మడుపల్లిలో నర్సింహారావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ మధిర ప్రాంతంలో సిపిఐ బలోపేతం కోసం ప్రజాప్రతినిధుల గెలుపు కోసం నిరంతరం నర్సింహారావు కృషి చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమాల్లో నర్సింహారావు ముందు వరుసలో ఉండే వారని, ఆయన ఆశయ సాధన కోసం ఈ ప్రాంత కమ్యూనిస్టులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగా శేషగిరిరావు, తలారి రమేష్, శీలువేరు శ్రీనివారావు, నీరుకొండ మురళీ, కొండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉంటూ పిల్లలు వాటిని దుర్వినియోగం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బాలల సంక్షేమ కమిటీ చైర్పన్ భారతీరాణి తెలిపారు. గురువారం నగరంలోని త్రివేణి పాఠశాలలో బాల బాలికలకు సురక్షితమైన వ్యవస్థలపై స్కోప్ ఆర్ది చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు అంతర్జాలాన్ని వినియోగించడం తప్పని సరైందన్నారు. కానీ వాటిని పిల్లలు సరైన రీతిలో వినియోగించి చదువుకు, భవిష్యత్తుకు తోడ్పాడేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయడం ద్వారా బాలలు నిరంతరం అంతర్జాలంలో వేధింపులకు గురై మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒక వ్యక్తి కోసం రాజస్థాన్ నుంచి ఖమ్మం వచ్చిన బాలిక కేసును ఉదహరించారు. ఇలాంటివి జరగకుండా మన జిల్లాలో బాలందరిని సురక్షితంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సైబర్ సెల్ ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ నేరాలు రోజు రోజుకు రెట్టింపు సంఖ్యలో నమోదవుతున్నాయన్నారు. మన ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను, మెసేజ్‌లను తెరవవద్దన్నారు. పొరపాటున తెరిస్తే మన వ్యక్తిగత వివరాలతో పాటు ఖాతాల్లో నగదు కూడా మాయమవుతుందన్నారు. సైబర్ నేరం జరిగినట్లు గుర్తిస్తే గంట లోపు 1930కు ఫోన్ చేయాలన్నారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా సాధ్యమైనంత త్వరగా తిరిగి డబ్బు పొందవచ్చన్నారు. స్కోప్ ఆర్ది డైరెక్టర్ ఎంఎల్ ప్రసాద్ మాట్లాడుతూ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో అంతర్జాలంలో బాలలు సురక్షితంగా ఏవిధంగా ఉండాలో అవగాహన కార్యక్రమాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నామన్నారు. బాలల సమ్యలు ఏమైనా ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కోప్ ఆర్ది అసిస్టెంట్ డైరెక్టర్ ప్రమీల, కో ఆర్డినేటర్ లక్ష్మి సుజాత, త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్లు డా।। గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులపై అటవీ అధికారుల దాడిని ఖండిస్తున్నాం

ప్రజాపక్షం/కారేపల్లి: ఎర్రబోడు గ్రామంలో ఆదివాసీ గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దాడిని బిఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని వైరా నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు అన్నారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఇది పూర్తిగా అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ దాడిగా తెలుస్తుందని, గతంలో బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న వాడు ఆదివాసీ గిరిజనులకు 4లక్షల ఎకరాలకు పైగా పోడు భూముల పట్టాలు ఇచ్చిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం అయితే ప్రజలు తగిన బుద్ది చెప్తారని తెలిపారు. ఈ దాడిపై ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల కమిషన్, గవర్నర్‌కు త్వరలో ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

# నూతన మార్గంలో గంజాయి స్మగ్లర్లు

ప్రజాపక్షం/పాల్వంచ : గంజాయి రవాణా కోసం స్మగ్లర్లు నూతన మార్గాన్ని అవలంభిస్తున్నారు. గత కొంత కాలంగా భద్రాచలం మీదుగా పాల్వంచ నుండి ఇతర ప్రాంతాలకు చేరవేయటానికి కార్లు, బైక్‌లు, లారీలు తదితర వాహనాలను ఉపయోగించేవారు. పోలీసులు, సంభంధిత అధికారులు గట్టి నిఘాపెట్టి ఎప్పటికప్పుడు గంజాయి రవాణాను అడ్డుకొంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వేలాది కిలోల గంజాయిని పట్టుకొని వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిఘాను తట్టుకోలేక స్మగ్లర్లు తమ పంథాను మార్చుకొన్నారు. తాజాగా స్మగ్లర్లు ప్రవేటు వాహనాల ద్వారా గంజాయి రవాణాకు తెరతీసినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పాల్వంచ, దమ్మపేట నుండి విశాఖ పట్నం కు వెళ్ళే ప్రవేటు బస్సులను తమ గంజాయి రవాణాకు అనుకూలంగా మార్చుకొన్నారు. విహార యాత్రల పేరుతో కొందరు ప్రభుద్దులు ఒడిస్సా నుండి వైజాగ్ ద్వారా గుట్టుచప్పుడు కాకుండా గాంజాయిని పాల్వంచ పట్టణానికి చేరవేస్తు



న్నారనే పట్టణ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ప్రవేటు బస్సులపై నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. అందు బాటులోకి రాని పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ : ఈ విషయంపై పాల్వంచ సిఐ కే.సతీష్‌ను ఫోన్ ద్వారా వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అందు బాటులోకి రాలేదు.

# సింగరేణి పీఆర్‌ఓకు జర్నలిజంలో డాక్టరేట్

ప్రజాపక్షం/ కొత్తగూడెం టౌన్ : సింగరేణి హైదరాబాద్ కార్యాలయం లో ప్రజా సంబంధాల అధికారి పీఆర్‌ఓగా పనిచేస్తున్న శ్రీ రాముల శ్రీకాంత్ తాను సమర్పించిన పరిశోధన అధ్యయనానికి తెలంగాణ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. బుధ వారం నిజామాబాద్ లోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ నుండి డాక్టరేట్ సర్టిఫికెట్ ను శ్రీరాముల శ్రీకాంత్ స్వీకరించారు. సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, తెలంగాణ ఉద్యమంపై కేస్ స్టడీ" అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధనాత్మక అధ్యయనానికి ఆయనకు ఈ డాక్టరేట్ ను బహూకరించారు. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ ఉద్యమంలో యువత అగ్రభాగంలో నిలిచారు. దీనికి ఉద్యమ ఆకాంక్షను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్ల డంలో, సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా దోహదప



డింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ విధంగా సోషల్ మీడియా కీలక భూమిక పోషించింది అని వివరిస్తూ శ్రీకాంత్ తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇప్పటి వరకు సింగరేణి ఉద్యోగుల్లో పీ హెచ్ డీ సాధించిన వారు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత చదువుల పట్ల జిజ్ఞాసతో శ్రీకాంత్ పీ హెచ్ డీ సాధించటంపై ఛైర్మన్ ఎండీ ఎన్. బలరామ్ తన అభినందనలు తెలిపారు. వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత విద్యార్హతలు సాధించాలనుకునే వారికి ప్రేరణను ఇస్తుంద న్నారు. తన పరిశోధన అనుభవంతో సింగరేణి ప్రజా సంబంధాల విభాగానికి కూడా మంచి పేరు తీసుకువస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఈడీ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జీఎం మార్కెటింగ్ టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు అభినంద నలు తెలిపారు.

# వన సమారాధన.. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/ఆళ్లపల్లి : మండల కేంద్రంలోని రైతులు స్థానికంగా ఉన్న కిన్నెరసాని వాగుకు వెళ్లి సామూహిక సమవన ఆరాధన చేసి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు ఈ సంవత్సరం వర్షాలు లేక రైతులు కదేల వుతున్నారని, వర్షాలు విరివిగా కురవాలని వనదేవతలను గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను కుల మతాలకతీతంగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అనాదిగా వర్షాలు కురవాలని పంటలు పండాలని వన మహోత్సవం తిరుణాల జరుపుకుంటూ వస్తు న్నామని, ఈ తిరుణాలకు వచ్చి గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తే వరుణదేవుడు కరుణించి వర్షాలు కురుస్తాయని నమ్మకం ఈ క్రమంలోనే పంట చేలు వీడుపడుతున్న నేపథ్యంలో వనదేవతకు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరపటం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈక్రమంలోనే మండల కేంద్రంలోని



బోడాయికి 108 బిందెల నీటితో అభిషేకం చేశారు. అందుకు వానదేవుడు కరుణించి కొద్దిపాటి వర్షం కురవడం జరిగిందని, అదే విధంగా విరివిగా వర్షాలు కురవాలని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నాట్లపై రైతులకు, కూలీలకు అవగాహన



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని కట్టుకాసారాం గ్రామంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి (ఏఈవో) బీ.శిరీష రైతులకు, కూలీలకు అవగాహన కల్పిస్తు వారితో మమైకమై... వారికి అవగాహన కల్పిస్తున్నారు. గురు వారం కట్టుకాచారం గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలలో పర్యటించారు. కూలీలతో కలిసి నాట్లు వేశారు. నాట్లు వేసే పద్ధతిని వివరించారు. నాటు ఎదుగుదలకు, కలుపు నివారణ కు అవసరమైన పద్ధతులను కూలీలకు వివరించారు. కూలీల కొరత ను ccఅధిగమించేందుకు అలాగే ఖర్చు ను తగ్గించుకునేందుకు వెదజల్లే మరియు డ్రమ్ సీడర్ పద్ధతులను రైతులు అవలంభించాలని సూచించారు.

## విద్యార్థులు చట్టాలపై

# అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/ మధిర : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ క్రిమినల్ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత న్యాయ సంహిత, ఫోక్స్, బాల నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక నగరాలు, మత్తు పదార్థాల స్మగ్లింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న పొరపాట్లతో ఎంతో విలువైన జీవితాలు నాశనం అవుతున్నాయని, విద్యార్థులకు చట్టం పట్ల సరైన అవగాహ ఏర్పాటు చేసుకుంటూ తద్వారా భవిష్యత్‌లో ఉన్నతమైన పౌరులుగా బాధ్యతాయుతమైన జీవితాన్ని ఆనందంగా గడపాలని విద్యార్థులకు సూచించారు. తలిదండ్రులకు తలవొంపులు తేవద్దని, విద్యార్థులు గౌరవంతో, సహృద్భావంతో మెలగాలని, మంచి ఆరోగ్యకరమైన సమాజంలోకి పయనించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, అవసరమైన సందర్భంలో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తోట నర్సింహారావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వేమిరెడ్డి నాగలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సహకరిస్తే మరింత అభివృద్ధి

ప్రజాపక్షం/పినపాక: గ్రామాల అభివృద్ధి కోసం ఉన్నత శాఖ అధికారుల ఆదేశాల మేరకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎంపీవో వెంకటేశ్వర రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రోడ్లను ఆక్రమించకుండా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండ డా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కోరారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ దిన దిన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రోడ్డుకి ఇరువైపులా నీళ్ల ఆగకుండా, స్థానికులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రావెల్ పోపిస్తున్నామని, అందరూ సమిష్టి కృషితో సహకరిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ముందు ఉంటామన్నారు. ఎన్నో సంవత్సరలుగా ఎదురుచూస్తున్న పబ్లిక్ టాయిలెట్లు నిర్మాణం సైతం త్వరలోనే జరుగుతుందన్నారు.



# పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కృషి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 90 రోజుల పాటు మధ్యవర్తిత్వ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి ఎం రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంకోసం మీడియేషన్ అనే పేరుతో ఈ డ్రైవ్‌ను న్యూఢిల్లీ నల్సా, సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సలేషన్ ప్రాజెక్టు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల డబ్బు, సమయం వృధా కాకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. వివాహ బంధానికి చెందిన వివాదాలు, ప్రమాదబీమా కేసులు, గృహహింస కేసులు, చెక్బౌన్స్, సివిల్ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రెండు అవార్డులు అందుకున్న కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం తరపున జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బొంబాయిలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను గురువారం అందుకున్నారు. ఐఐటి బాంబేలో నిర్వహించిన ఓపెన్ సోర్స్ జిఐఎస్ డే లో నేషనల్ జియోస్పెషియల్ ప్రాక్టీషనర్ అవార్డు ఒకటి కాగా మరొకటి ఓపెన్ సోర్స్ జిఐఎస్ కో హార్ట్ అవార్డు. ఈ అవార్డులను ఐఎస్ఆర్ఓ మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కు అందజేశారు.



# అంగరంగ వైభవంగా తీజ్ వేడుకలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని మంగాపురంతండా లో గురువారం తీజ్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బంజారా, లంబాడీ సంస్కృతి సాంప్రదాయాలను చాటి చెప్పే పండుగ సందర్భంగా గ్రామంలో ఆటా, పాటలతో సందడి చేశారు. డప్పు వాయిద్యాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా పండుగ ను జరుపుకున్నారు. ముగింపు సందర్భంగా నృత్యాలు చేస్తూ... నిమజ్జనం కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజారాంపేట సోసైటీ చైర్మన్ బాలాజీ, మాజీ సర్పంచ్ భూక్యా సుధాకర్, గ్రామ పెద్దలు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, తేజావత్ గిరి, మల్లికార్జున్, రామచంద్, కోటేశ్వరరావు, గోబ్రియా, శంకర్, తేజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించారు. హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీ కుమారి, పాలక మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చౌగాని పాపారావు, పెండ్లి రామిరెడ్డి, భూక్యా గిరిప్రసాద్, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**-అమ్మవారికి శాఖాంబరీ దేవి అలంకరణ...**

ఈ నెల 20వ, తేదీ ఆదివారం శాఖాంబరీ దేవిగా పెద్దమ్మతల్లి భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రజనీ కుమారి తెలిపారు. అధిక సంఖ్యలో దర్శించుకొని అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# 'మేము సైతం' ఆధ్వర్యంలో ఆర్థికసాయం

ప్రజాపక్షం/మణుగూరు: మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ సంతోష్ నగర్ ప్రాంతానికి చెందినకొండ రామచందర్ (70) అనారోగ్యంతో మరణించారని తెలిసి మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ స్పందించి ట్రస్ట్ ద్వారా రామచందర్ కుటుంబ సభ్యులకు 3000/దహన సంస్కరాల కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మంగి మల్లికార్జున్, అంబులెన్స్ డ్రైవర్ ప్రదీప్, ట్రస్ట్ సభ్యులు పి. జగన్ మోహన్, గ్రామ పెద్దలు, ఊరుకొండ లక్ష్మణ్, బోయినపల్లయ్య, వినయ్, మేల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు





## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ చేయూత



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కులం, మతం, పార్టీ చూడమని, ప్రతి ఒక్కరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు పక్కా మంజూరు చేస్తామన్నారు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి. గురువారం పట్టణంలోని వేంసూరు రోడ్డులో గల రాణి ఈవెంట్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి సంబురాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద భీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కదం తొక్కి, పెద్దఎత్తున మహిళలు సంబరాలకు వచ్చిన మీ అందరిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. అందరి దీవెనలు, ఆశీస్సులతో ఇందిరమ్మ ప్రభుత్వం 18 నెలలు పూర్తి చేసుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆరా, కొరా మంచి పనులను కొనసాగిస్తూ, ప్రజల కోరికలు తీరుస్తూ, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ముందుకు వెళుతున్నామన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు రూ.22 వేల 500 కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, డ్వాక్రా గ్రూపుల నిర్మాణం గత ఇందిరమ్మ హయాంలోనే జరిగిందన్నారు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. ఒకప్పుడు ఆడవారు ఇంటికే పరిమితమయ్యేవారని, రాను,రాను గత అంధకారం నుండి ఇప్పుడు వెలుగు లోకి వచ్చారన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, జిల్లాలో ఆర్టీసీ బస్సులు, మహిళా మార్ట్, డెయిరీ షెడ్డులు, చాలా యూనిట్లు ఏర్పాటు చేశామని, ఇదంతా మహిళల పొదుపుతోనే సాధ్యమైందని అన్నారు. ఒక మహిళను చదివిస్తే ఒక కుటుంబం, తరం బాగు పడుతుందని, అదే ఒక పురుషుణ్ణి చదివిస్తే, అతను మాత్రమే బాగుపడతాడని అన్నారు. ఒక మహిళ చేతిలో డబ్బు అందితే, అది అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇప్పుడు మహిళలు ఇన్వెస్టర్ స్థాయికి వెళ్లారని, కుటుంబాలు బాగుపడాలని, పిల్లలు బాగా ఎదగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, మార్కెట్ కమిటి చైర్మన్లు దోమ ఆనంద్,బాగం నీరజ చౌదరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, చలగుళ్ళ, నరసింహారావు, ఇమ్మనేని ప్రసాద్,కమల్ పాషా, మానుకోట ప్రసాద్, తోట సుజలరాణి,దూదిపాళ్ళ రాంబాబు, అదనపు డిఆర్డీవో జయశ్రీ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ శాఖ అధికారి సునీల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, సత్తుపల్లి తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ నరసింహా, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విప్పలమడకలో దొంగలు

**రూ.3.50లక్షల సొత్తు అపహరణ**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం విప్పలమడక గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు దోపిడికి పాల్పడ్డారు. గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి సుమారు రూ.3.5లక్షలు సొత్తు అపహరణకు గురైనట్లు సమాచారం. దొంగతనం విషయాన్ని తెలుసుకున్న వైరా పోలీసులు విప్పలమడక గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న యడ్లపల్లి మంగయ్య ఇంటికి చేరుకున్నారు. బుధవారం రాత్రి యడ్లపల్లి మంగయ్య అతని భార్య ఇంటి తలుపులకు గడియలు పెట్టి ఇంటి ముందు ఉన్న వరండాలో పడుకున్నారు. అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వారు ఇంటి వెనుక ప్రహారీగోడకు ఆనుకొని ఉన్న పెండ దిబ్బ పై నుంచి ఆ ప్రహారీ గోడను దూకి ఇంట్లోకి ప్రవేశించారు. వెనుక ఉన్న తలుపును తెరిచిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను తెరిచి బీరువా లాకర్‌లోని సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలను, రూ.65వేల నగదును అపహరించారు. గురువారం ఉదయం 5గంటలకు నిద్రలేచిన మంగయ్య భార్య తన ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే ఖమ్మం లోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు యడ్లపల్లి పుల్లారావుకు చోరీ జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు వివరించారు. పుల్లారావు ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైరా పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. వైరా పోలీసులు చోరీ జరిగిన విషయాన్ని క్లూస్ టీమ్‌కి సమాచారం అందించారు. క్లూస్ టీం సభ్యులు విచారణ ప్రారంభించారు.

# ములకలపల్లి ఎస్సి హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ములకపల్లి ఎస్సి హాస్టల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న హాస్టల్ వార్డెన్ శ్రీధర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజీత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్సీశాఖ డిడి అనసూయకు జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం అజిత్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో మంగళవారం రాత్రి సుమారు 11 గం.లకు తన సోదరులతో కలిసి మద్యం సేవించారని, మద్యం మత్తులు డాన్స్‌లు చేస్తూ విద్యార్థులను కొట్టారని, బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. మద్యం సేవించటమే కాకుండా విచ్చలవిడిగా ప్రవర్తించిన వార్డెన్‌తో పాటు స్నేహితులను కూడా కఠినంగా శిక్షించాలన్నారు. బియ్యం, కోడి గుడ్లు, పప్పు బయటి షాపుల్లో విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నాడని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిందిపోయి మద్యం తాగి చిందులేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని మండిపడ్డారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వార్డెన్ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు రాజ్‌కమల్, కళ్యాణి, వంశీ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ,సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉ.11 గం.లకు బూర్గంపాటులోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో చెక్కులు పంపిణీ చేస్తారు.మధ్యాహ్నం 1.15 నిమిషాలకు సారపాకలో గ్రావెల్ రోడ్‌కు నిర్మాణానికి శంకుస్థాపన, 2.30 గం.లకు భద్రాచలం ఐటిడిఏలోని గిరిజన భవన్‌లో వడ్డీలేని రుణాల చెక్కులతో పాటు పలు రకాల చెక్కులను అందించనున్నారు.

## పాఠశాలలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని రేజర్ల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, ప్రాథమిక పాఠశాలలను అసిస్టెంట్ కలెక్టర్ లోకల్ బాడీ శ్రీజ(ఐఏఎస్) గురు వారం సందర్శించారు. రెండు పాఠశాలల్లో విద్యా బోధన ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను, పాఠశాల మౌలిక వసతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథక అమలుతీరును పరిశీలిస్తూ, పిల్లలతో పాటు క్రింద కూర్చొని మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. గత సంవత్సరం కంటే ప్రభుత్వ పాఠశాలలు అడ్మిషన్స్ ను పెంచిన ఉపాధ్యాయులు,ఎంఈఓ ను అభినందించారు.

## డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును కలిసిన ఐఎన్‌టియూసీ బృందం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇటీవల సింగరేణి సంస్థలో డైరెక్టర్ (పర్స నల్ , అడ్మినిస్ట్రేష న్, వెల్ఫేర్) గా నియమిం పబడి మొదటిసారి సత్తుపల్లి విచ్చేసిన గౌత మ్ పోట్రు (ఐ.ఏ.ఎస్) ని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ కార్య దర్శి తీగల క్రాంతి కుమార్ ఆద్వర్యంలో ఐఎన్టీయూ సీ బృందం గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, పూల బొకే అందజేసింది. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం సాధించుటకు ఐఎన్టీయూసీ యూనియన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామారావు (ఫిట్ సెక్రటరీ, జే.వి.ఆర్ ఓసి), బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ సి.హెచ్.పి) నాయకులు కిషన్ రావు, రఫీ, రషీద్, నాగేందర్, శ్రీనివాసరావు, నరేందర్, శ్రీధర్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.60కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని రావినూతల గ్రామానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.60కోట్లను డిప్యూటి సిఎం, మధిర శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క మంజూరు చేసినట్లు పిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం హైద్రాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం భట్టిని కిషోర్‌కుమార్ మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.60 మంజూరు చేస్తున్నట్లు ప్రకటించటం జరిగిందని కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టివిక్రమార్కకు ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు రావినూతల గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని తొర్లపాడులో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా 12మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా గురువారం వాటి నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క గతంలో పాదయాత్రలో పీపుల్స్‌మార్చ్ గూడులేని పేద ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ఎఎంసి డైరెక్టర్ అద్దంకి రవికుమార్, నిడమానూరు వంశీకృష్ణ, చిలువేరు బుచ్చిరామయ్య, కర్నాటి రామాఆరవు, నరేడ్ల వెంకటరెడ్డి, చేబ్రోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఆహ్వానించిన టియుడబ్ల్యూజె



**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల24న వైరాలోని శబరి గార్డెన్‌లో జరిగే టియుడబ్ల్యూజె ఐజెయు జిల్లా మహాసభలకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను వైరా జర్నలిస్టులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కొత్తా వెంకటేశ్వరరావు, ఏపూరి రాజారావు, పులి కృష్ణార్జున్‌రావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, గొల్లమందల విజయ్, నల్లమోతుల శ్రీనివాసరావు, అక్కిశెట్టి రవితేజ, రేచర్ల నాగరాజు, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.